వడ్డీరేట్లను తగ్గించిన బ్యాంకులు

ముంబై, ఏప్రిల్ 9: ఆర్బీఐ రెపోరేటును తగ్గించడంతో అందుకు తగ్గట్టుగా పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ), బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్, యూకో బ్యాంక్‌లు కూడా తమ రుణాలపై వడ్డీరేట్లను తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నాయి. మరికొన్ని బ్యాంకులూ ఇదే దిశగా వెళ్లనున్నాయి. ఇక ఇండియన్ బ్యాంక్ 35 బేసిస్ పాయింట్లు తగ్గించి 8.70 శాతానికి రెపో లింక్డ్ బెంచ్‌మార్క్ లెండింగ్ రేటు (ఆర్‌బీఎల్‌ఆర్)ను తెచ్చింది. ఈ నెల 11 నుంచి అమల్లోకి వస్తుంది. పీఎన్‌బీ ఆర్‌బీఎల్‌ఆర్ 9.10 శాతం నుంచి 8.85 శాతానికి తగ్గింది. గురువారం నుంచి అమలవుతుంది. బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్‌బీఎల్‌ఆర్ కూడా పావుశాతం తగ్గి ఇదే స్థాయిలో దిగొచ్చింది. యూకో బ్యాంక్ రెపో లింక్డ్ రేటు 8.8 శాతానికి తగ్గింది. గురువారం నుంచి అమల్లోకి వస్తుంది.

గోల్డ్ రివర్స్‌గేర్

రూ.91 వేల దిగువకు పుత్తడి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: బంగారం ధరలు క్రమంగా దిగొస్తున్నాయి. ఒకవైపు వాణిజ్య యుద్ధం మరింత తీవ్రతరమవుతుండటంతో పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను వెనక్కి తీసుకుంటుండటంతో ఈక్విటీలతోపాటు అతి విలువైన లోహాలు ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. దీంట్లోభాగంగా దేశ రాజధాని న్యూఢిల్లీలో పదిగ్రాముల బంగారం ధర రూ.1,050 తగ్గింది. 99.9 శాతం స్వచ్ఛత కలిగిన గోల్డ్ ధర రూ.91,250కి దిగొచ్చింది. అలాగే 99.5 శాతం స్వచ్ఛత కలిగిన గోల్డ్ ధర అంతే తగ్గి రూ.89,750కి దిగొచ్చింది. పసిడితోపాటు వెండి ధరలు కూడా తగ్గాయి. కిలో వెండి రూ.500 తగ్గి రూ.93,200కి దిగొచ్చింది. కానీ, అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 61.98 డాలర్లు ఎగబాకి 3,044.14 డాలర్లకు ఎగబాకగా, వెండి 2 శాతం అధికమై 30.41 డాలర్లకు చేరుకున్నది. అమెరికా-చైనా దేశాల మధ్య సుంకాల యుద్ధం మరింత ముదురుతుండటంతో పెట్టుబడిదారులు వేచి చూసేధోరణి అవలంభిస్తున్నారని అబాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సీఈవో చింతన్ మెహతా తెలిపారు. మరోవైపు, యూఎస్ ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ విడుదల చేయబోయే మినిట్స్, అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలపై విశ్లేషకులు దృష్టి సారించారని చెప్పారు.

ఒలెక్ట్రాకు 297 బస్సుల ఆర్డర్

హైదరాబాద్, ఏప్రిల్ 9: ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్‌కు మరో అతి పెద్ద ఆర్డర్‌ను చేజిక్కించుకున్నది. హిమాచల్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్(హెచ్‌ఆర్‌టీసీ) నుంచి 297 నాన్-ఏసీ ఎలక్ట్రిక్ బస్సుల ఆర్డర్ లభించినట్టు పేర్కొంది. ఈ ఆర్డర్ విలువ రూ.427 కోట్లని పేర్కొంది. 30 మంది ప్రయాణీకులు ప్రయాణించే ఈ బస్సు సింగిల్ చార్జింగ్‌తో 180 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. కంపెనీకి వచ్చిన అతిపెద్ద ఆర్డర్లలో ఇది కూడా ఒకటని పేర్కొంది.

పోకో సరికొత్త ఫోన్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: దేశీయ మార్కెట్లోకి మరో స్మార్ట్‌ఫోన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది పోకో. 6.88 హెచ్‌డీ+ ప్యానెల్‌తో తయారైన పోకో సీ71 ఆక్టాకోర్ ప్రాసెసర్, 12జీబీ ర్యామ్, 5200 ఎంఏహెచ్ బ్యాటరీ, 32 మెగాపిక్సెల్ డ్యూయల్ కెమెరా, ముందువైపు 8 మెగాపిక్సెల్ కెమెరా వంటి ఫీచర్స్‌తో తీర్చిదిద్దింది. వీటిలో 4జీబీ ర్యామ్+64 జీబీ మెమొరీ కలిగిన మాడల్ ధర రూ.6,499, 6జీబీ ర్యామ్+128 జీబీ మెమొరీ మాడల్ ధర రూ.7,499గా నిర్ణయించింది. గురువారం నుంచి ఈ మొబైల్ ఫ్లిప్‌కార్ట్‌లో లభించనున్నది.

820 బిలియన్ డాలర్లు దాటిన ఎగుమతులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: దేశీయ ఎగుమతులు మరో మైలురాయికి చేరుకున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను 820 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులు ఇతర దేశాలకు ఎగుమతికానున్నట్టు కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది. అంతర్జాతీయ దేశాల్లో అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నప్పటికీ ఎగుమతులు ఏడాది ప్రాతిపదికన 6 శాతం ఎగబాకినట్లు వెల్లడించింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 778 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయి.

మళ్లీ నష్టాల్లోకి మార్కెట్లు

సెన్సెక్స్ 380, నిఫ్టీ 137 పాయింట్ల క్షీణత
ప్రతీకార సుంకాలపై మదుపరుల్లో ఆందోళన

ముంబై, ఏప్రిల్ 9: దేశీయ స్టాక్ మార్కెట్లు మళ్లీ నష్టాల్లోకి జారుకున్నాయి. అమెరికా-చైనా దేశాల మధ్య వాణిజ్య యుద్ధమేఘాలు కమ్ముకుంటుండటంతో అంతర్జాతీయ మార్కెట్లలో మళ్లీ అలజడికి కారణమైంది. దేశీయంగా రిజర్వుబ్యాంక్ వరుసగా రెండోసారి వడ్డీరేట్లను పావుశాతం తగ్గించినప్పటికీ మదుపరుల్లో ఆందోళన నెలకొన్నది. ఫలితంగా అమ్మకాలకు మొగ్గుచూపడంతో 74 వేల పాయింట్ల దిగువకు పడిపోయింది. ఒక దశలో 550 పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 379.93 పాయింట్లు కోల్పోయి 73,847.15 వద్ద ముగిసింది. మరోసూచీ నిఫ్టీ కూడా 136.70 పాయింట్లు నష్టపోయి 22,399.15 వద్దకు జారుకున్నది. బలహీనంగా ప్రారంభమైన సూచీలకు ఆసియా ఈక్విటీ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలు పతనానికి ఆజ్యంపోశాయని, వీటికి తోడు చైనాపై అమెరికా ప్రతీకార సుంకాలను 104 శాతానికి పెంచుతూ తీసుకున్న నిర్ణయం సూచీలపై ప్రతికూల ప్రభావం చూపాయని జియోజిట్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు ఇప్పటికే అమెరికా ఆర్థిక మాంద్యం గుప్పిట్లోకి వెళ్తున్నదన్న సంకేతాలు అంతర్జాతీయ ఆర్థిక రంగం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నదని, యూఎస్ బాండ్ ఈల్డ్ పెరుగుదలతో ప్రపంచంలోని సురక్షితమైన ట్రెజరీ ఆస్తులను విక్రయించడానికి ప్రేరేపించిందన్నారు. రిజర్వుబ్యాంక్ వడ్డీరేట్లను తగ్గించినప్పటికీ మార్కెట్ సెంటిమెంట్‌ను మెరుగుపరచడంలో విఫలమైందని చెప్పారు.

- బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ షేరు 3.43 శాతం నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది.
- దీంతోపాటు టెక్ మహీంద్రా, లార్సెన్ అండ్ టుబ్రో, టాటా స్టీల్, సన్‌ఫార్మా షేర్లు రెండు శాతానికి పైగా నష్టపోయాయి.
- ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, యాక్సిస్ బ్యాంక్, టీసీఎస్, ఎన్‌టీపీసీ, బజాజ్ ఫైనాన్స్, టాటా మోటార్స్, బజాజ్‌ఫిన్‌సర్వ్, భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, కొటక్ బ్యాంక్ షేర్లు నష్టపోయాయి.
- కానీ, నెస్లె, హెచ్‌యూఎల్, టైటాన్, పవర్‌గ్రిడ్, అల్ట్రాటెక్ సిమెంట్, ఐటీసీ, ఏషియన్ పెయింట్స్, రిలయన్స్, అదానీ పోర్ట్స్, ఐసీఐసీఐ బ్యాంక్, మారుతి, మహీంద్రా షేర్లు లాభాల్లో ముగిశాయి.
- రంగాలవారీగా చూస్తే ఐటీ సూచీ అత్యధికంగా 2.19 శాతం కోల్పోగా..రియల్టీ 2 శాతం, టెక్నాలజీ 1.57 శాతం, మెటల్ 1.44 శాతం, ఇండస్ట్రియల్స్ 1.42 శాతం చొప్పున పతనం చెందాయి.
- కేవలం వాహన, కన్జ్యూమర్ డ్యూరబుల్, ఎఫ్ఎంసీజీ రంగ షేర్లు లాభాల్లోకి వచ్చాయి.
- అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 4.23 శాతం తగ్గి 60.16 డాలర్లకు పరిమితమైంది.

నేడు మార్కెట్లకు సెలవు

మహవీర్ జయంతి సందర్భంగా గురువారం స్టాక్ మార్కెట్లు సెలవు పాటించనున్నాయి. మార్కెట్లతోపాటు ఫారెక్స్, కమోడిటీ, ఇతర మార్కెట్లు కూడా పనిచేయవు. దీంతో ఈవారం ట్రేడింగ్ నాలుగు రోజులకు పరిమితమైంది. శుక్రవారం యథావిధిగా సూచీలు పనిచేయనున్నాయి.

గృహ, వాహన రుణాలు చౌక

- అన్నిరకాల లోన్లపై తగ్గనున్న ఈఎంఐ భారం!
- మరింత దిగొచ్చిన కీలక వడ్డీరేట్లు
- రెపోరేటు పావుశాతం తగ్గి 6 శాతానికి
- ద్రవ్యపరపతి సమీక్షలో ఆర్బీఐ నిర్ణయం
- మున్ముందు మరిన్ని కోతలన్న సంకేతాలు
- వృద్ధిరేటు అంచనా డౌన్.. ఈసారి 6.5%

ముంబై, ఏప్రిల్ 9: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) వరుసగా రెండో ద్రవ్యసమీక్షలోనూ కీలక వడ్డీరేట్లను తగ్గించింది. ఈ ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను చేపట్టిన తొలి ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలో రెపోరేటును మరో పావుశాతం (25 బేసిస్ పాయింట్లు) కోత పెట్టినట్టు బుధవారం ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ప్రకటించారు. దీంతో 6.25 శాతం నుంచి 6 శాతానికి వచ్చింది. ఇప్పటికే ఈ ఏడాది ఫిబ్రవరి ద్రవ్యసమీక్షలో దాదాపు ఐదేండ్ల తర్వాత రెపోరేటును తొలిసారి పావుశాతం (6.5 శాతం నుంచి 6.25 శాతానికి) తగ్గించిన విషయం తెలిసిందే. 2020 మే తర్వాత ఈ ఫిబ్రవరిలోనే తగ్గించారు. ఈ క్రమంలో తాజా తగ్గింపు అరశాతానికి చేర్చగా.. గృహ, వాహన, వ్యక్తిగత రుణగ్రహీతలకు మరింత లబ్ధి చేకూర్చినట్టైంది. ఈఎంఐల భారం ఇంకొంత దిగనున్నది మరి.

మున్ముందు మరిన్ని కోతలు

ఆర్బీఐ తమ ద్రవ్యవిధాన వైఖరిని 'న్యూట్రల్' నుంచి 'ఎకామ్డేటివ్'కు మార్చుకున్నది. దీంతో రాబోయే ద్రవ్యసమీక్షల్లో వడ్డీరేట్లు స్థిరంగా లేదా తగ్గడమో జరుగనున్నాయి. సోమవారం నుంచి బుధవారం వరకు 3 రోజులపాటు ఆర్బీఐ గవర్నర్ మల్హోత్రా నేతృత్వంలో జరిగిన ద్రవ్యసమీక్షలో ఎంపీసీలోని మొత్తం ఆరుగురు సభ్యులూ రెపోరేటు తగ్గింపునకే ఓటేశారు. ఫలితంగా రెపోరేటుకు అనుసంధానమైన అన్ని ఈబీఎల్ఆర్ దిగిరానున్నాయి. రుణాల ఈఎంఐల భారం కూడా తగ్గనున్నదని బ్యాంకింగ్ వర్గాలు చెప్తున్నాయి.

పీ2ఎం పేమెంట్స్‌కు జోష్

పర్సన్-టు-మర్చంట్ పేమెంట్స్ (పీ2ఎం) కోసం యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)లో లావాదేవీల పరిమితిని పెంచేందుకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)కు ఆర్బీఐ అనుమతిచ్చింది. ప్రస్తుతం పీ2ఎంతోపాటు పర్సన్-టు-పర్సన్ (పీ2పీ) పేమెంట్స్‌కు యూపీఐ ద్వారా లక్ష రూపాయల లావాదేవీకే అనుమతి ఉన్నది. అయితే కొన్ని సందర్భాల్లో పీ2ఎం పేమెంట్స్‌ను రూ.2 లక్షలు, రూ.5 లక్షలదాకా చేసుకోవచ్చు.

ద్రవ్యసమీక్ష ముఖ్యాంశాలు

- 3.35 శాతంగా రివర్స్ రెపోరేటు యథాతథం
- ఒత్తిడిలో ఉన్న ఆస్తుల సెక్యూరిటైజేషన్‌పై ముసాయిదా నిబంధనలు
- కో-లెండింగ్ మరింత విస్తరించే దిశగా ఆర్బీఐ అడుగులు
- ఈ నెల 23న 54వ ఎంపీసీ సమావేశం మినట్స్ విడుదల
- జూన్ 4-6 మధ్య తదుపరి ద్రవ్యసమీక్ష

4 శాతంగా ద్రవ్యోల్బణం

ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) ద్రవ్యోల్బణం 4 శాతానికి దిగిరావచ్చన్న ఆశాభావాన్ని ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వ్యక్తం చేశారు. మునుపు దీన్ని 4.2 శాతంగా అంచనా వేసిన విషయం తెలిసిందే. దేశంలో వ్యవసాయోత్పత్తి బాగుందని, అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గుముఖం పడుతున్నాయన్న ఆయన పరిస్థితులు ఇలాగే ఉంటే అన్నింటి ధరలు కూడా తగ్గుతాయన్న విశ్వాసాన్ని కనబర్చారు. కూరగాయల ధరలు దిద్దుబాటుకు లోనవుతుండటంతో ఈ ఏడాది ఫిబ్రవరిలో వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం 21 నెలల కనిష్ఠాన్ని తాకుతూ 3.8 శాతానికి చేరిన సంగతి విదితమే. ఫలితంగా ఆహార ద్రవ్యోల్బణం గణాంకాలు సైతం కిందకొస్తున్నాయి.

ఎవరేమన్నారు?

'నేను కేవలం సంజయ్‌ని. అంతేగాని మహాభారతంలోని సంజయ్‌ని కాదు. ఆయనకున్నట్టు దివ్యదృష్టి నాకు లేదు. ప్రస్తుత ప్రపంచ అనిశ్చితి ఎప్పుడు వీడుతుంది. వడ్డీరేట్లు ఇంకెంత తగ్గడానికి వీలుంది అన్న వివరాలు నేను చెప్పలేను' అన్నారు విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్తూ ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా. ఇక బ్యాంకింగ్ వ్యవస్థ సురక్షితంగానే ఉందని, ఇండస్ ఇండ్ సంక్షోభం ఒక ఎపిసోడ్ మాత్రమేనని, వైఫల్యం కాదన్నారు.

ఆర్బీఐ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. ఇప్పుడున్న వాణిజ్య అనిశ్చిత పరిస్థితుల మధ్య దేశ ఆర్థిక వ్యవస్థకు ఈ రకమైన ప్రోత్సాహం అవసరం
-నిర్మలా సీతారామన్, కేంద్ర మంత్రి

టారిఫ్‌లు, భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతల నడుమ ఆర్బీఐ ప్రగతిదాయక ద్రవ్య విధానాన్ని ప్రకటించింది. దేశంలో తగ్గుతున్న ద్రవ్యోల్బణం, సుస్థిర ఆర్థిక వ్యవస్థకు ఇది నిదర్శనం. దీన్ని స్వాగతిస్తున్నాం.
-బొమన్ ఇరానీ, క్రెడాయ్ జాతీయాధ్యక్షుడు

వరుస ద్రవ్యసమీక్షల్లో రెపోరేటును 50 బేసిస్ పాయింట్లు తగ్గించడం.. ప్రస్తుత ప్రపంచ అనిశ్చిత పరిస్థితులకు తగ్గ ద్రవ్య విధానాన్నే ప్రతిబింబిస్తున్నది. మార్కెట్‌కూ ఇది లాభదాయకం.
-సీఎస్ శెట్టి, ఎస్బీఐ చైర్మన్

ఈ ఏడాది రెపోరేటు మరో 50 బేసిస్ పాయింట్లు తగ్గవచ్చని మేము భావిస్తున్నాం. అంతర్జాతీయంగా నెలకొన్న ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో వడ్డీరేట్ల తగ్గింపు భారత ఆర్థిక వ్యవస్థకు ఉత్సాహాన్నిచ్చేదే.
-రాధికారావు, డీబీఎస్ బ్యాంక్ ఈడీ

వృద్ధి అంచనాకు కత్తెర

దేశ జీడీపీ వృద్ధిరేటుకు ఆర్బీఐ కోత పెట్టింది. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) 6.5 శాతానికే పరిమితం కావచ్చని అంచనా వేసింది. మునుపు ఇది 6.7 శాతంగా ఉండటం విశేషం. అంతర్జాతీయ వాణిజ్యంలో నెలకొన్న ప్రతికూల పరిస్థితులు, విధానాల్లో అనిశ్చితి వల్లే ఆర్థిక వృద్ధి 0.2 శాతం మేర తగ్గవచ్చని అంచనా వేసినట్టు ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. వ్యవసాయ రంగం ఆశాజనకంగా కనిపిస్తున్నదని, తయారీ రంగం కోలుకుంటున్న సంకేతాలున్నాయని, సేవా రంగం స్థితిస్థాపకతను ప్రదర్శిస్తున్నదని చెప్తూనే.. టారిఫ్ వార్ దెబ్బకు భారతీయ వాణిజ్య ఎగుమతులు పడిపోవచ్చున్న ఆందోళనను వెలిబుచ్చారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే ఇబ్బందికరమేనని హెచ్చరించడం గమనార్హం. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తంగా దేశ ఆర్థిక వృద్ధిరేటు 6.5 శాతంగా ఉండొచ్చన్న మల్హోత్రా.. తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో 6.5 శాతం, రెండో త్రైమాసికం (జులై-సెప్టెంబర్)లో 6.7 శాతం, మూడో త్రైమాసికం (అక్టోబర్-డిసెంబర్)లో 6.6 శాతం, నాల్గో త్రైమాసికం (జనవరి-మార్చి)లో 6.3 శాతంగా అంచనా వేశారు.

టారిఫ్‌లతోనే జీడీపీకి నష్టం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెరతీసిన ప్రతీకార సుంకాలపై ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ద్రవ్యోల్బణం కంటే దేశ జీడీపీ వృద్ధిరేటుపై ఇప్పుడు వాణిజ్య యుద్ధమే ఎక్కువగా ప్రభావం చూపేలా ఉందన్నారు. టారిఫ్‌ల దెబ్బకు మార్కెట్‌లో డిమాండ్ క్షీణిస్తుందని తెలిపారు. నిజానికి ఈ టారిఫ్ వార్.. చాలా దేశాల ఆర్థిక వ్యవస్థల ప్రగతిపై నీలిమబ్బులు కమ్ముకునేలా చేస్తుందని, ఎగుమతుల పతనం, వృద్ధిరేటు క్షీణత, ద్రవ్యోల్బణం సవాళ్లను సృష్టిస్తుందని పేర్కొన్నారు. భారత్ కూడా ఇందుకు మినహాయింపు కాదన్నారు.

గోల్డ్‌లోన్ రూల్స్‌ను కఠినం చేయట్లేదు

బంగారం రుణాలపై ప్రతిపాదించిన మార్గదర్శకాలు.. ఆ రుణాల లభ్యతను కఠినతరం చేయడానికి కాదని ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు. అయితే హేతుబద్ధం చేస్తామని చెప్పారు. 'త్వరలోనే ముసాయిదా మార్గదర్శకాలు విడుదలవుతాయి. మా మదిలో గోల్డ్ లోన్ రూల్స్‌ను కఠినం చేయాలన్న ఆలోచనేదీ లేదు. కేవలం హేతుబద్ధీకరణపైనే దృష్టిపెట్టాం' అని ఆర్బీఐ ద్రవ్యసమీక్ష అనంతరం మీడియాతో మాట్లాడుతూ మల్హోత్రా చెప్పారు. పసిడి రుణాలపై ఆర్బీఐ కొత్త మార్గదర్శకాల నేపథ్యంలో బుధవారం దేశీయ స్టాక్ మార్కెట్లలో ఆయా గోల్డ్ ఫైనాన్స్ సంస్థల షేర్లు నష్టపోయాయి. బీఎస్ఈలో ముత్తూట్ ఫైనాన్స్ షేర్ విలువ గరిష్ఠంగా 6.70 శాతం నష్టపోగా, మణప్పురం ఫైనాన్స్ 1.88 శాతం, ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ 2.55 శాతం, చోళమండలం ఫిన్‌కో 2.37 శాతం క్షీణించాయి.

30 వరకు వివాద్ సే విశ్వాస్ స్కీం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 9: పన్ను చెల్లింపులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు(సీబీడీటీ) ప్రవేశపెట్టిన వివాద్ సే విశ్వాస్ స్కీం ఈ నెల 30న తుది గడువుగా నిర్ణయించింది. అక్టోబర్ 1, 2024లో ప్రారంభించిన ఈ స్కీంకు తొలిసారిగా చివరి తేదీని ప్రకటించింది. పన్ను చెల్లింపుల పాత బకాయిలను ఈ నెల చివరిలోగా చెల్లింపులు చేయాలని ఐటీ డిపార్ట్‌మెంట్ ఎక్స్‌లో పేర్కొంది. పన్ను చెల్లింపుదారులు తమ పాత బకాయిలకు సంబంధించి ఎదురైన సమస్యలు పరిష్కరించుకోవచ్చును. ఇప్పటి వరకు దాదాపు 2.7 కోట్ల మంది చెల్లించాల్సిన రూ.35 లక్షల కోట్ల ప్రత్యక్ష పన్ను డిమాండ్లకు సంబంధించి పలు కోర్టుల్లో కేసులు నడుస్తున్నాయి. వీటిని పరిష్కరించాలనే ఉద్దేశంతో గడిచిన ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌లో ఈ స్కీంను ప్రవేశపెట్టింది.

రాష్ట్ర ప్రభుత్వంతో గోద్రెజ్ క్యాపిటల్ జట్టు

హైదరాబాద్, ఏప్రిల్ 9(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఎంఎస్ఎంఈల పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేసే ఉద్దేశంలో భాగంగా గోద్రెజ్ ఇండస్ట్రీస్ గ్రూపునకు చెందిన గోద్రెజ్ క్యాపిటల్ రాష్ట్ర ప్రభుత్వంతో భాగస్వామ్య ఒప్పందం చేసుకున్నది. బుధవారం సచివాలయంలో పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, గోద్రెజ్ క్యాపిటల్ సీఈవో మనీష్ షాలు ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. తెలంగాణ ఎంఎస్ఎంఈ పాలసీ-2024లో భాగంగా ఏర్పాటు కానున్న కొత్త పరిశ్రమలకు, ముఖ్యంగా మొదటిసారి పరిశ్రమ ఏర్పాటు చేస్తున్న వారికి రుణ సహాయం అందించడం ఈ ఒప్పంద ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వవర్గాలు తెలిపాయి. ముఖ్యంగా మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఆర్థిక సహాయం అందించేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందని జయేశ్ రంజన్ పేర్కొన్నారు.

ట్రంప్ టారిఫ్‌లు వాయిదా

90 రోజులు ఆపేసిన అమెరికా • చైనాపై అత్యధికంగా 125 శాతం
అగ్రరాజ్యంపై 84 శాతం వేసిన డ్రాగన్



బీజింగ్, ఏప్రిల్ 9: అంతర్జాతీయ మార్కెట్‌లో ఆందోళనలు చెలరేగుతున్న నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ప్రతీకార సుంకాలపై నిర్ణయాన్ని 90 రోజులపాటు చాలా దేశాలపై వాయిదా వేశారు. అయినప్పటికీ చైనాపై సుంకాలను 125 శాతానికి పెంచడం గమనార్హం. దీంతో అమెరికా, చైనా దేశాల మధ్య నెలకొన్న వాణిజ్య యుద్ధం మరింత పెరిగినట్టైంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలను చైనా పెడచెవిన పెట్టడంతో భారీ స్థాయిలో మరోసారి సుంకాలను విధించారు. దీంతో చైనా వస్తువులపై విధించిన సుంకాలు 125 శాతానికి చేరాయి. గతంలో 50 శాతం విధించిన ట్రంప్..ఈసారి చైనాపై గుర్రుమీదున్న ట్రంప్ తన సుంకాన్ని అమాంతం పెంచేశారు. పలు దేశాలు తమ వస్తువులపై అధిక సుంకాలు విధిస్తూ తమ ఆర్థిక వ్యవస్థను కొల్లగొడుతున్నాయని ట్రంప్ పలుసార్లు ఆరోపించిన విషయం తెలిసిందే. అన్ని దేశాలు తమ వస్తువులపై సుంకాలు తగ్గించాలని గత కొన్నిరోజులుగా చేస్తున్న విజ్ఞప్తులను ఆయా దేశాలు పట్టించుకోకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. గత మార్చి వరకు చైనా వస్తువులపై అమెరికా 10 శాతం సుంకాన్ని విధించింది. ఇటీవల పెంచిన పన్నుతో ఇది 54 శాతానికి చేరుకున్నది. తాజాగా మరో 50 శాతం పెంచుతూ తీసుకున్న నిర్ణయం చైనా అంతే వేగంతో స్పందించింది.

అంతే దీటుగా చైనా..

అమెరికాకు పోటీగా చైనా కూడా అదే స్థాయిలో తిప్పికొడుతున్నది. అమెరికా ఉత్పత్తులపై తాము 84 శాతం సుంకం విధిస్తున్నట్లు తాజాగా ప్రకటించింది. ఈ సుంకాల పెంపు గురువారం నుంచి అమలు కానున్నాయి.

ట్రంప్ సెల్ఫ్ గోల్: రఘురామ్ రాజన్



పలు దేశాలపై ప్రతీకార సుంకాలను విధించడాన్ని రిజర్వు బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ తప్పుపట్టారు. ఇది సెల్ఫ్ గోల్ లాంటిదని అభిప్రాయపడ్డారు. ఈ ప్రతీకార సుంకాల నిర్ణయం వ్యాణిజ్య రంగంలో అనిశ్చితికి దారితీయనున్నదని, అగ్రగామి ఇరు దేశాలు అనుసరిస్తున్న విధానాలు ఆయా దేశాలపై ప్రతికూల ప్రభావం చూపనున్నదని, ఇదే సమయంలో భారత్‌కు కొంతమేర లాభం చేకూరే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. ఈ కీలక నిర్ణయంతో స్టాక్ మార్కెట్లు కుప్పకూలుతాయని, భారతీయ ఎగుమతిదారులకు మద్దతు ఇవ్వడంతోపాటు వాణిజ్య చర్చలకు ఇది సరైన సమయమన్నారు. ట్రంప్ తీసుకున్న నిర్ణయం సెల్ఫ్ గోల్ లాంటిదని, స్వంత ఆర్థిక వ్యవస్థను నిర్వీర్యం చేయగలదని రాజన్ హెచ్చరించారు. నిరుద్యోగం తక్కువస్థాయిలో కొనసాగుతున్నదని, మరోవైపు ద్రవ్యోల్బణం, ఫెడ్ వడ్డీరేట్లు తగ్గించడంతో ఇవి అనుకూల స్థాయిలో ఉన్న ప్రస్తుత తరుణంలో ట్రంప్ బాంబు పేల్చాడని ఇది క్షేమకరం కాదని అభిప్రాయపడ్డారు. అమెరికా ఎగుమతులపై ఆధారపడివున్న వియత్నాం లాంటి దేశాలకు పెద్ద ఎదురుదెబ్బ అన్నారు.

ఫార్మా ఉత్పత్తులపై సుంకాలు!

- స్పష్టంచేసిన డొనాల్డ్ ట్రంప్

న్యూయార్క్, ఏప్రిల్ 9: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫార్మా ఉత్పత్తులను వదలడం లేదు. ఇప్పటికే పలు ఉత్పత్తులపై ప్రతీకార సుంకాలను విధించిన ఆయన..త్వరలో ఔషధాలపై టారిఫ్‌లను విధించబోతున్నట్టు సంకేతాలిచ్చారు. ఎంతమేర విధించేదానిపై స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. ఈ దెబ్బకు దేశీయ ఫార్మా కంపెనీల షేర్లు కుప్పకూలాయి. మరోవైపు, విదేశాల్లో ఉన్న ప్లాంట్లను అమెరికాకు తరలిస్తే ఆయా కంపెనీలకు రాయితీలు ఇచ్చే విషయాన్ని ఆలోచిస్తున్నట్టు అక్కడి ప్రభుత్వ ప్రతినిధి చెప్పారు. ఈ నిర్ణయంతో అత్యధికంగా ఔషధాలను ఎగుమతి చేస్తున్న భారత్‌పై ప్రతికూల ప్రభావం చూపనున్నది. 2024లో భారత్ నుంచి అమెరికాకు 12.73 బిలియన్ డాలర్ల విలువైన ఔషధాలు ఎగుమతి అయ్యాయి. అమెరికా హెల్త్‌కేర్ విభాగంలో కీలక పాత్ర పోషిస్తున్న దేశీయ ఫార్మా సంస్థలకు ఇది ఎదురుదెబ్బలాంటిదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఎగుమతులతో అమెరికా హెల్త్‌కేర్ రంగం భారీ స్థాయిలో లాభపడుతున్నదని, 2022లో 219 బిలియన్ డాలర్ల మేర లబ్ధిపొందింది. 2013 నుంచి 2022 మధ్యకాలంలో అమెరికా ఆర్థిక వ్యవస్థకు 1.3 ట్రిలియన్ డాలర్ల మేర లబ్ధిపొందింది. వచ్చే ఐదేండ్లలో జనరిక్ ఔషధాలతో ఆయ దేశానికి 1.3 ట్రిలియన్ డాలర్ల మేర ఆదాకానున్నదని పేర్కొంది.

రాష్ట్ర ఫార్మా సంస్థలకు దెబ్బ



రాష్ట్రానికి చెందిన ఫార్మా సంస్థలకు ఇది చేదువార్త. అమెరికా ఎగుమతులపై అత్యధికంగా ఆధారపడివున్న రాష్ట్ర ఫార్మా సంస్థలకు ట్రంప్ నిర్ణయం షాక్‌నకు గురిచేసింది. అమెరికాకు ఎగుమతవుతున్న దేశీయ ఫార్మా ఉత్పత్తుల్లో తెలంగాణ వాటా 28.16 శాతంగా ఉండటమే ఇందుకు కారణం. ప్రస్తుతం తెలంగాణ నుంచి వ్యాక్సిన్లు, ఫార్మాస్యూటికల్ ఔషధాలు 150 దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. 2023-24లో ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ నుంచి రూ.36,893 కోట్ల విలువైన ఔషధాలు ఎగుమతి అయ్యాయి. మొత్తం దేశీయ ఎగుమతుల్లో రూ.1,16,182 కోట్ల ఎగుమతుల్లో వీటి వాటా 32 శాతంగా ఉన్నది. ఔషధాల దిగుమతులపై భారీ సుంకాలను విధించే ప్రణాళికలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పునరుద్ఘాటించడంతో ఫార్మా సూచీలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయని మోతీలాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ సిద్ధార్థ తెలిపారు. దీంతో బ్లూ జెట్ హెల్త్‌కేర్ షేరు అత్యధికంగా 10 శాతం నష్టపోగా..మార్క్సన్స్ ఫార్మా షేరు 6.69 శాతం, వొకార్డ్ 5.14 శాతం, గ్లెన్‌మార్క్ ఫార్మాస్యూటికల్స్ 4.35 శాతం, అరబిందో ఫార్మా 3.54 శాతం చొప్పున పతనం చెందాయి. వీటితోపాటు లుపిన్ 3.09 శాతం, గ్లాండ్ ఫార్మా 2.27 శాతం, సన్ ఫార్మా 2.18 శాతం, డాక్టర్ రెడ్డీస్ 1.20 శాతం నష్టపోయాయి.

బీవోబీ ప్రత్యేక డిపాజిట్ స్కీం

ముంబై, ఏప్రిల్ 9: ప్రభుత్వరంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ) ప్రత్యేక డిపాజిట్ స్కీంను అందుబాటులోకి తీసుకొచ్చింది. 'బీవోబీ స్కైర్ డ్రైవ్ డిపాజిట్ స్కీం' పేరుతో ప్రవేశపెట్టిన 444 రోజుల కాలపరిమితి డిపాజిట్లపై 7.15 శాతం వార్షిక వడ్డీని బ్యాంక్ ఆఫర్ చేస్తున్నది. సీనియర్ సిటిజన్లకు 7.75 శాతం, సూపర్ సీనియర్ సిటిజన్లకు 7.80 శాతం వడ్డీని ఆఫర్‌చేస్తున్నది బ్యాంక్. రూ.3 కోట్ల లోపు రిటైల్ టర్మ్ డిపాజిట్లకు ఈ వడ్డీరేటు వర్తించనున్నదని బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బీనా వాహీద్ తెలిపారు. డిపాజిట్‌దారులను ఆకట్టుకోవాలనే ఉద్దేశంతో ఈ ప్రత్యేక డిపాజిట్ స్కీంను అందుబాటులోకి తీసుకొచ్చినట్టు చెప్పారు.